క్షణక్షణం.. భయం భయం

- చెలరేగిపోతున్న గంజాయి బ్యాచ్
- గ్యాంగ్‌లుగా ఏర్పడి అసాంఘిక కార్యకలాపాలు
- ఇటీవల పట్టణంలో రెండు హత్యలు
- భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు


హత్యకు గురైన మణికంఠ (ఫైల్)


హత్య చేసిన నిందితుడిని విలేకరుల ముందు ప్రవేశపెట్టిన పోలీసులు (ఫైల్)

ఏలేశ్వరం: ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న ఏలేశ్వరం పట్టణంలో ఇటీవల అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోయాయి. కొందరు వ్యక్తులు బ్యాచ్‌గా ఏర్పడి గంజాయి క్రయవిక్రయాలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఇటీవల రెండుహత్యలు జరగడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. నేరప్రపంచానికి దూరంగా ఉండే పట్టణంలో గంజాయి విక్రయాలు, హత్యలు జరగడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

50 మంది యువకులతో..

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం, జెడ్పీ అతిథి గృహం, ఖాళీగా ఉన్న వైఆర్‌సీ క్వార్టర్స్, సాయిబాబా మెట్టను అనుకుని ఉన్న ఏలేరు కాలువ రేవు గంజాయి విక్రయాలకు నిలయాలుగా మారాయి. సుమారు 50 మంది యువకులను బ్యాచ్‌గా తయారుచేసి కొందరు గంజాయి వ్యాపారం చేయిస్తున్నారు. ఇటీవల వారిలో వారికి తగదాలు రావడంతో ఏలేరు నది ఒడ్డున ఒకరిని, కళాశాల మైదానంలో మరొకరిని హత్య చేశారు. పట్టణంలోని కొనేటి చెరువుగట్టు వీధికి చెందిన ఇద్దరు యువకులు ఈ బ్యాచ్‌కు నాయకత్వం వహిస్తున్నారు. కళాశాల మైదానంలో హత్య జరిగిన ఘటనలో వాడిన కారు గంజాయి బ్యాచ్ నిర్వాహకులదే అని పలువురు ఆరోపిస్తున్నారు. తొలుత జరిగిన హత్యలో మృతుడికి ఎటువంటి దన్ను లేకపోవడంతో కుటుంబ సభ్యులు న్యాయపరంగా ముందుకు వెళ్లలేకపోయారు. రెండో హత్య ఘటనలో కారుతో పాటు ముద్దాయిని పోలీసులు అదుపులోని తీసుకున్నారు. దీనిపై పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేస్తే మరింత మంది దోషులు పట్టుబడే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. దీంతో పాటు అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నాం

పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నాం. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. నేరాలను అదుపు చేసేందుకు కృషి చేస్తున్నాం.

జి.సతీష్, ఎస్సై, ఏలేశ్వరం

వైభవంగా సుదర్శన, మహాచండీ హోమాలు


ఎస్.అన్నవరంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు


రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు

తుని రూరల్: పౌర్ణమిని పురస్కరించుకుని ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం సుదర్శన హోమం నిర్వహించారు. ఉదయం అర్చకులు గణపతి పూజ, హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానంలో వేద పండితులు శాస్త్రోక్తంగా మహాచండీ హోమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. జగన్నాథగిరి శివారు రమణ మహర్షి ఆశ్రమంలో సరస్వతీ విద్యా సేవ సమితి ఆధ్వర్యంలో మహాగణపతి హోమం నిర్వహించారు. సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గొర్లి శివరామకృష్ణ, పలువురు భక్తులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం

అన్నవరం: పౌర్ణమిని పురస్కరించుకునిరత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ఆదివారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమ గుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు అమరయ్య ఘనపాఠి, నర్శింహమూర్తి, దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. 25 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

ఆక్రమణను అడ్డుకున్న హైవే అధికారులు


తాళ్లూరులో షాపింగ్ కాంప్లెక్స్ ఎదురుగా కాలువ ఆక్రమణను అడ్డుకుంటున్న అధికారులు

గండేపల్లి: జాతీయ రహదారికి సంబంధించిన స్థలంలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాన్ని శనివారం రాత్రి హైవే అధికారులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని తాళ్లూరు శివారు ఉప్పలపాడుకు వెళ్లే మార్గాన్ని ఆనుకుని ఇటీవల షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. ఆ కాంప్లెక్స్‌కు సరైన మార్గం లేకపోవడంతో సంబంధిత వ్యక్తులు షాపింగ్ కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న కాలువలో రాత్రికి రాత్రే తూరలు ఏర్పాటు చేసేందుకు జేసీబీ, క్రేన్ సహాయంతో పనులు ప్రారంభించారు. విధి నిర్వహణలో ఉన్న హైవే ఐఎంటీ మేనేజర్ సుబ్బారావు అక్రమ నిర్మాణం పనులను అడ్డుకుని పనులను నిలిపివేశారు. హైవే స్థలంలో నిర్మాణం చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంబంధిత వ్యక్తుల వద్ద ఉన్న పత్రాలను పరిశీలించిన అధికారులు ఆ పత్రాలు చెల్లవని నిర్ధారించారు. పనులు చేస్తున్న యంత్రాలపై గండేపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కాగా స్థానిక రైతులు సంఘటన స్థలం వద్దకు చేరుకుని పంట కాలువపై అక్రమ నిర్మాణం చేపడితే వాలు నుంచి పారే నీటికి ఆటకం ఏర్పడుతుందని, తద్వారా తమ పంటలకు నష్టం వాటిల్లుతుందని ఆందోళన చేశారు. ఈ సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని రైతులు మార్ని అబ్బు, మోతుకూరి వెంకట్రావు, మార్ని జెమ్మి, రాంబాబు తదితరులు అధికారులను కోరారు.

సాగర తీరాన.. సన్‌డే సమయాన


ఉప్పాడ సాగరతీరంలో పర్యాటకుల సందడి

కొత్తపల్లి: ఎండలు మండిపోతున్నాయి. రోజురోజుకూ భానుడు ఉగ్రరూపం దాల్చడంతో ఎండవేడిమిని తట్టుకోలేక జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ క్రమంలో ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు ఉప్పాడ సాగర తీరానికి భారీగా పర్యాటకులు తరలివచ్చి సేద తీరుతున్నారు. ఉప్పాడ తీర ప్రాంతం ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. కొత్తపల్లి మండలంలోని వివిధ గ్రామాలతో పాటు పిఠాపురం, కాకినాడ, గొల్లప్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఉప్పాడ సాగర తీరానికి భారీగా తరలివచ్చారు. యువత కడలి కెరటాల్లో కేరింతలు కొట్టారు. పర్యాటకుల ఆటల పాటలతో సాగర తీరం క్రీడా మైదానంగా మారిపోయింది. తలుపులమ్మతల్లి లోవను దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నానికి సాగర తీరానికి చేరుకున్నారు. అధిక సంఖ్యలో వాహనాలు రావడంతో కాకినాడ–ఉప్పాడ బీచ్ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానిక సీఐ శ్రీనివాస్, ఎస్సై రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

అపూర్వ కలయిక


కోటనందూరులో 30 ఏళ్ల తరువాత కలిసిన పూర్వ విద్యార్థులు

కోటనందూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1993–94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా మూడు దశాబ్దాల తరువాత గ్రామంలోని ఓ కల్యాణ మండపంలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని సందడి చేశారు. వ్యక్తిగత జీవితాలతో పాటు అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ రోజంతా ఆనందంగా గడిపారు. పాటలు పాడుతూ, డ్యాన్సులు వేస్తూ విద్యార్థుల్లా మారిపోయారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను ఘనంగా సత్కరించారు.

వంశ మూలాలను మరువ వద్దు


పుస్తక ఆవిష్కరణలో ప్రముఖులు

గండేపల్లి: వంశ మూలాలను మరవ వద్దని నల్లమిల్లి వంశీయులు పేర్కొన్నారు. దేశ, విదేశాల్లో ఉద్యోగ, వ్యాపార, సినీ, రాజకీయ, వ్యవసాయ రంగాల్లో స్థిరపడిన వీరంతా మండలంలోని సూరంపాలెం ఆదిత్య విద్యాసంస్థల ప్రాగణంలో ఆదివారం కలుసుకున్నారు. కాకినాడ జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు నల్లమిల్లి బుచ్చిరెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో నల్లమిల్లి వంశీకుల చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. గిన్నీస్ బుక్, లిమ్కా బుక్, వండర్ బుక్, తెలుగు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం కోసం దరఖాస్తు చేసుకున్నట్టు నల్లమిల్లి వంశీకులు తెలిపారు. సుమారు మూడు వేల మంది తమ కుటుంబ సభ్యులతో పాల్గొని సందడి చేశారు. కార్యక్రమంలో కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి, సినీ హీరో నల్లమిల్లి సుభాష్, దర్శకుడు, రచయిత నల్లమిల్లి వంశీ, హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, విజయవాడ మెట్రో రైలు ఎండీ నల్లమిల్లి పెద రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యకు మోక్షమెప్పుడో ?

- అన్నవరంలో తరచూ స్తంభిస్తున్న ట్రాఫిక్
- మెయిన్ రోడ్ దురాక్రమణతో ప్రమాదాలు
- సినిమా హాలు సెంటర్‌లో రోడ్డుపైనే లాడ్జిల నిర్మాణం


అన్నవరం లాడ్జి సెంటర్‌లో ఆక్రమణల కారణంగా నిలిచిపోయిన వాహనాలు


మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ కారణంగా దేవస్థానం ఘాట్ రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

అన్నవరం: గ్రామంలో మెయిన్ రోడ్ ఆక్రమణలకు గురికావడంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. సత్యదేవుడు వెలసిన ప్రముఖ పుణ్య క్షేత్రం అన్నవరానికి ప్రతి రోజూ వేల సంఖ్యలో భక్తులు వివిధ వాహనాల్లో వస్తారు. వీరికి తోడు విశాఖపట్నం, విజయవాడ వైపు ప్రయాణించే వారు కూడా స్వామివారి తొలిపాంచా వద్ద ఆగి సత్యదేవుని పాదాలను దర్శించి ప్రసాదాలు కొనుగోలు చేసి వెళతుంటారు. ప్రతిరోజూ కనీసం వేయి వాహనాలు తొలిపాంచా వద్ద ఆగుతాయి. గ్రామంలోని ఆంధ్రాబ్యాంక్ సెంటర్ నుంచి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గుడి వరకూ కుడి వైపు దేవస్థానం స్థలం కాగా, ఎడమ వైపు ప్రైవేట్ స్థలాలు కావడంతో పెద్ద సంఖ్యలో లాడ్జిలు, షాపులు నిర్మించారు. ఆ లాడ్జిలు, షాపుల్లో 90 శాతం రోడ్డును ఆక్రమించి నిర్మించడంతో వాహనాల రాకపోకలకు వీలు లేక తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

నిత్యం ప్రమాదాలు

2015లో గోదావరి పుష్కరాల సందర్భంగా అన్నవరం మెయిన్ రోడ్‌ను నాలుగు లైన్ల రోడ్డుగా విస్తరించారు. మధ్యలో డివైడర్, రహదారికి రెండు వైపులా డ్రైన్లు నిర్మించారు. కాలక్రమేణా ఆ డ్రైన్లను ఆక్రమించడంతో పాటు రెండు వైపులా సగం రోడ్డును ఆక్రమించేశారు. దీంతో వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. గత జనవరి 18న అన్నవరంలో ఆర్టీసీ బస్సు ఢీకొని రౌతులపూడికి చెందిన బాలుడు బర్ల దుర్గాప్రసాద్ (6) మృతి చెందాడు. గ్రామ శివారు స్నేహ రెస్టారెంట్ ఎదురుగా కారు వాష్ సెంటర్ వద్ద వాష్‌కు వచ్చిన వాహనాలను రోడ్డు మీద పెట్టడంతో వాటిని తప్పించే ప్రయత్నంలో బైక్ రోడ్డు మధ్యలోకి రావడంతో వెనుక వస్తున్న ఆర్టీసీ బస్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా దుర్గాప్రసాద్ మృతి చెందాడు.

రోడ్డును ఆక్రమించి లాడ్జి నిర్మాణం

అన్నవరంలో రోడ్డును ఆక్రమించి లాడ్జిలను నిర్మించారు. ప్రధానంగా పాత సినిమా సెంటర్‌లో లాడ్జిలన్నీ ఇలా నిర్మించినవే. భవనాలు సొంత స్థలాల్లో నిర్మించి మిగిలిన హంగులన్నీ రోడ్డు మీద నిర్మించారు. లాడ్జిల బోర్డులు, షెడ్లు కూడా రోడ్డు మీదనే ఉంటాయి. దీంతో అక్కడ వాహనాలు తప్పుకోవడానికి కూడా వీలు ఉండడం లేదు.

దేవస్థానానికి వచ్చే వాహనాలకు ఇబ్బంది

గ్రామంలో మెయిన్ రోడ్ ఆక్రమణలకు గురి కావడంతో దేవస్థానానికి వచ్చే వాహనాలు కొండ దిగువకు వచ్చేటప్పుడు ఘాట్‌రోడ్‌లో ట్రాఫిక్ స్తంభిస్తోంది. దేవస్థానం బస్సులతో పాటు, భక్తుల వాహనాలు కూడా దేవస్థానం ఘాట్ రోడ్‌లో ఆగిపోతున్నాయి. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అన్నవరం మెయిన్ రోడ్‌లో ఆక్రమణలు తొలగించాలని భక్తులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ఆక్రమణల తొలగింపునకు సహకరిస్తాం



అన్నవరం మెయిన్ రోడ్డులో ఆక్రమణలు ఉన్న మాట వాస్తవం. గతంలో ఒకటి రెండు సార్లు తొలగించడానికి ప్రయత్నిస్తే మాపై ఒత్తిడి రావడంతో వెనక్కి తగ్గాల్సి వచ్చింది. ఇప్పుడైనా ఆర్అండ్‌బీ పంచాయితీ అధికారులు ముందు కొచ్చి ఆక్రమణలు తొలగించడానికి ప్రయత్నిస్తే మా వంతు సహకారం అందిస్తాం.

అజయ్ బాబు, ఇన్‌చార్జి ఎస్సై, అన్నవరం

ఆక్రమణలు తొలగిస్తాం



అన్నవరంలో మెయిన్ రోడ్ ఆక్రమణలకు గురికావడంతో గ్రామంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీని కారణంగా దేవస్థానం ఘాట్ రోడ్‌లోనూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. దేవస్థానం పరిధిలోని అనంతలక్ష్మి సత్రం వద్ద గల రోడ్డులో ఆక్రమణలను త్వరలో తొలగిస్తాం.

చంద్రశేఖర్ అజాద్, ఈఓ, అన్నవరం దేవస్థానం

క్లుప్తంగా

నేడు కనకదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: సత్యదేవుని తొలిపాంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారి జన్మనక్షత్రం ‘మూల’ సందర్భంగా సోమవారం అమ్మవారికి చండీహోమం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకూ హోమం, పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల భక్తులు రూ.750తో టికెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొనాలని కోరారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన


ఏలేశ్వరం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎంఈఓ అబ్బాయి

ఏలేశ్వరం: ప్రతివిద్యార్థికి నిర్దిష్టమైన లక్ష్యం ఉండాలని ఎంఈఓ బి.అబ్బాయి సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యం ఏర్పాటు చేసుకుని కృషి, పట్టుదలతో దానిని సాధించాలన్నారు. లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాలతో విద్యార్థులు ఎంతో మేలు జరుగుతోందన్నారు. విద్యార్థులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో రాబందుల ప్రాతపై ట్రైనర్ మజ్జి నాగేశ్వరరావు విద్యార్థులకు అవగాహన కల్పించారు.

7న విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ

రౌతులపూడి: మండలంలోని కోడూరు, బీబీ పట్నం గ్రామాల్లోని ఆలయాల్లో ఈ నెల 7న విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కోడూరులో కోదండరామస్వామి ఆలయం వద్ద ఉదయం 7.45 గంటలకు ధ్వజ స్తంభ ప్రతిష్ఠ, బీబీ పట్నం వేములమ్మ అమ్మవారి నూతన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఆ రోజు మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన ఏర్పాటు చేశామన్నారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మెగా రక్తదాన శిబిరం


కత్తిపూడిలో రక్తదానం చేస్తున్న యువకులు

శంఖవరం: మండలంలోని కత్తిపూడి జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 72 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ రక్తదానంతో మరొకరి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. సేకరించిన రక్తాన్ని నిరుపేదలకు ఉపయోగిస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఇతరుల ప్రాణాలను కాపాడాలని కోరారు. పేదలకు అండగా నిలుస్తున్న ఫౌండేషన్ సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం


తుని జీఎన్టీ రోడ్డులో మజ్జిగ పంపిణీ చేస్తున్న త్రిమూర్తి స్వామి

తుని: స్థానిక జీఎన్టీ రోడ్డులో విజయదుర్గ గ్రూపు సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆదివారం ఆ సంస్థ అధినేత, సిటీ కేబుల్ ఎండీ చొడిశెట్టి త్రిమూర్తిస్వామి ప్రారంభించారు. ఎండల తీవ్రత, వడగాల్పులు ఎక్కువగా ఉన్నందున ప్రయాణికుల దాహార్తి తీర్చడం తమ బాధ్యతగా భావించి చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. పట్టణ ప్రధాన కూడళ్లలో మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేసి ఎండలు తగ్గుముఖం పట్టే వరకూ కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

కోడి పందేలాడుతున్న నలుగురి అరెస్టు

జగ్గంపేట: మండలంలోని మల్లిపాక గ్రామ శివారులో రహస్యంగా నిర్వహిస్తున్న కోడి పందెల శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో కోడి పందేలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.3100 స్వాధీనం చేసుకున్నట్లు జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరు పరుస్తామని చెప్పారు.

ఒమ్మంగిలో ఏరువాక

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగిలో టీడీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో ఆదివారం ఏరువాక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యప్రభ అరక పట్టి పొలం దున్ని ఏరువాక సాగారు. అనంతరం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు మెట్ల రమణబాబు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్షంతో ఉపశమనం


తునిలో కురుస్తున్న వర్షం

తుని: వేసవి తాపంలో విలవిలాడుతున్న ప్రజలు ఆదివారం సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. ఉదయం నుంచి వడగాడ్పులు, ఉక్కబోత ఎక్కువగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం ఒక్క సారిగా ఆకాశం మేఘావృతమై ఈదురు గాలలతో వర్షం కురిసింది. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చి చల్లని వాతావరణాన్ని ఆస్వాదించారు. ఈదురుగాలుల కారణంగా మామిడి తోటలకు నష్టం కలిగింది. పక్వానికి వచ్చిన మామిడి కాయలు నేలరాలడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

36 వాహనాలు సీజ్


తునిలో సీజ్ చేసిన వాహనాలతో సీఐ నాగదుర్గారావు

తుని: నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న 36 వాహనాలను సీజ్ చేసినట్టు పట్టణ సీఐ నాగదుర్గారావు ఆదివారం తెలిపారు. జిల్లా ఎస్పీ ఎం.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి పర్యవేక్షణలో పట్టణంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టామన్నారు. పట్టణ ప్రధాన కూడళ్లలో పటిష్టంగా గస్తీ నిర్వహించి బండి రికార్డు సక్రమంగా లేని వాహనాలపై వెళుతున్న, మద్యం సేవించి వాహనాలు నడిపిన, అనవసరంగా రోడ్లపై తిరిగే ఆకతాయిలపై చర్యలు తీసుకున్నామన్నారు. 110 వాహనాలను తనిఖీ చేసి పత్రాలు లేని 24 మోటారు సైకిళ్లు, 3 కార్లు, ఆటో, ఒక లారీని సీజ్ చేశామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. బహిరంగ ప్రాంతాల్లో మద్యం తాగుతున్న 27 మందిని అదుపులోకి తీసుకొని కోర్టులో ప్రవేశపెట్టామన్నారు. ఈ సందర్భంగా సీఐ నాగదుర్గారావు మాట్లాడుతూ పట్టణంలో ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలిసినా వెంటనే 100 నంబరుకు గాని, పట్టణ పోలీసులకు గాని సమాచారం ఇవ్వాలన్నారు. నేరాల నియంత్రణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

పంచభూతాలను కలుషితం కానీయొద్దు


వాకలపూడి ఆశ్రమంలో ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ ఉమర్ ఆలీషా, డీఎస్పీ వెంకటేశ్వరరావు

కాకినాడ రూరల్: ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించి పంచభూతాలు కలుషితం కాకుండా ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకోవాలని విశ్వ విజ్ఞాన విద్యాధ్యాత్మిక పీఠాధిపతి, సద్గురువు డాక్టర్ ఉమర్ ఆలీషా పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని వాకలపూడి ఆశ్రమంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉమర్ ఆలీషా, ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలుత ఆశ్రమ ప్రాంగణంలో మొక్కలు నాటి, పక్షులకు ధాన్యపు కుచ్చులను వేలాడదీశారు. ర్యాలీకి వచ్చిన వారికి మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం ర్యాలీని ప్రారంభించారు. ప్లాస్టిక్ నిరోధిస్తూనే ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటడం ద్వారా పంచభూతాలు కలుషితం కాకుండా చూడవచ్చని ఉద్బోధించారు. మరో అతిథి ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సేవలకు తాత్వికత జోడించి లక్షలాది సభ్యులను తీర్చిదిద్దుతున్నారని పీఠాధిపతిని అభినందించారు. అనంతరం చేపట్టిన ర్యాలీ బోట్‌క్లబ్ వద్ద ఉమర్ ఆలీషా చలివేంద్రం వరకు సాగింది. పర్యావరణ పరిరక్షణకు కాకినాడ లక్ష్మి, అనిశెట్టి సత్యవతి కీర్తన పాడి ఆకట్టుకున్నారు. ప్రగతి అకాడమిక్ డైరెక్టర్ రఘురామ్, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, మహేంద్రవర్మ, రెడ్డి సూర్యప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

కౌలు చట్టంలో నిబంధనలు మార్చాలి

కరప: కౌలు చట్టంలో భూ యజమాని సంతకం నిబంధన ఎత్తివేయకపోతే కౌలురైతుకు ఏమాత్రం ఉపయోగం ఉండదని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రాజశేఖర్ అన్నారు. కౌలురైతు రాష్ట్ర జాతా ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన నడకుదురు, కొరిపల్లి, వలసపాకల గ్రామాల్లో పర్యటించి కౌలు రైతులకు కరపత్రాలిచ్చి ప్రచారం నిర్వహించారు. కౌలుదారులకు న్యాయం చేయాలనుకుంటే ఆర్‌బీకే సిబ్బంది క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి పంట సాగుచేసే వారిని గుర్తించి, వారి పేరున ఈ–క్రాప్ నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రధానమైన ఈ డిమాండ్‌తో రాష్ట్రవ్యాప్తంగా జాతా నిర్వహించి, ఈ నెల 12న విజయవాడ నుంచి ప్రకాశం బ్యారేజీ మీదుగా మంగళగిరిలోని సీసీఎల్ఏ కార్యాలయం వరకు పాదయాత్ర చేపట్టామన్నారు.

వైభవంగా సదస్యం

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి వైభవంగా సదస్యం నిర్వహించారు. పండితులు బుచ్చి వెంకటశాస్త్రి, ఆలయ అర్చకులు కొడమంచిలి కార్తీక్, తనికెళ్ల బుచ్చిబాబు, కొడమంచిలి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవంలో భాగంగా సోమవారం రాత్రి స్వామి శ్రీపుష్పయాగం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ రాజనాల విజయసారధి తెలిపారు.